క్లుప్తంగా

ఘనంగా 'దుర్గాలమ్మ వారాలు'

మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ వారాలు అత్యంత ఘనంగా శుక్రవారం రాత్రి నిర్వహించారు. కారుషెడ్ కూడలిలో వెలసిన బబ్బేలమ్మ పండగ మహోత్సవాల్లో భాగంగా ముఖ్యమైన అమ్మవార్లకి పసుపు కుంకుమ సమర్పించి వారాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా పీఎంపాలెం, పాత పీఎంపాలెం, లక్ష్మీవాని పాలెం, పిలకవానిపాలెం భక్తులు విశేషంగా సాము గరిడీలు, బల్ల వేషాలు, మందు గుండు సామగ్రితో తరలివచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కులదేవతకు పండ్ల గెలలు నైవేద్యం



పందిరికి వేలాడదీసిన పండ్ల గెలలు

ఆనందపురం : మండలంలోని దుక్కవానిపాలెంలో కుల దేవత పండగ ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం ప్రారంభమైన పండగ ఆదివారంతో ముగుస్తుంది. 14 ఏళ్లకు ఒకసారి ఈ పండగను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. దుక్క కుటుంబీకుల దేవతామూర్తి ఉన్న ఇంటి ముందు పందిరి వేసి అవకాశం ఉన్న వారందరూ వివిధ రకాల పళ్ల గెలలను తెచ్చి వేలాడదీసి అమ్మవారిని ఆరగించమని కోరుతారు. అరటి, తాటి, ఈత, కొబ్బరి, మామిడి, జీడి, జామ వంటి పళ్లతోపాటు డ్రింకులు, డబ్బులు కూడా వేలాడదీశారు. దీప దూప నైవేద్యాలు సమర్పించి కులదేవతను కొలిచారు.

బీజేపీ బలోపేతంపై దృష్టి

భీమునిపట్నం: భీమిలి మండల పరిధిలో బీజేపీని మరింత బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు ఆ పార్టీ మండల అధ్యక్షురాలు కంటుభుక్త సునీత తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనలో దేశం ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా భారత దేశానికి ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. పోలింగ్ బూత్ స్థాయిలో పార్టీ బలోపేతంపై మరింత దృష్టి సారిస్తున్నామని, అందరూ సహకరించాలని కోరారు. నాయకులు వాసుపల్లి శ్రీహరి, పోలిబోతు విజయ, బత్తిన వెంకటరమణ, తీగల ప్రభాకరరావు, గరికిన రామారావు, పోలిశెట్టి సురేష్, భవాని పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపునకు తక్షణ చర్యలు

మధురవాడ: మధురవాడ పరిసర ప్రాంతాల్లో ఆక్రమణల తొలగింపునకు తక్షణ చర్యలు చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయిశ్రీకాంత్ వర్మ ఆదేశించారు. శనివారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ప్రధాన రహదారులు, చంద్రంపాలెం, దుర్గానగర్, మిథిలాపురి వుడా కాలనీ, మారికవలస, నగరంపాలెం, కొమ్మాది జంక్షన్, బోయిపాలెంలో పర్యటించారు. ఈ సందర్భంగా మధురవాడ, మిథిలాపురి వుడా కాలనీలో ఆక్రమణలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని తొలగించాలని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. చెత్త కుప్పలు ఎప్పటికప్పుడు తొలగించాలని, గెడ్డల్లో పూడిక తొలగించి వర్షం నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చూడాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. ప్లాస్టిక్ నిర్మూలనకు కృషి చేయాలని కోరారు.

బెంచీలు ఏర్పాటు

పద్మనాభం: మండలంలోని మద్ది గ్రామంలో కంటుబోతు రాంబాబు జ్ఞాపకార్థం అతని సోదరుడు కంటుబోతు పైడిరాజు రెండు చోట్ల రూ.15వేలు విలువ చేసే నాలుగు సిమెంటు బెంచీలు శనివారం ఏర్పాటు చేశారు. మరిడిమాంబ ఆలయం వద్ద రెండు, శ్మశాన వాటిక వద్ద రెండు బెంచీలు ఏర్పాటు చేశారు.

కోలాటం ప్రదర్శన నేడు

పీఎం పాలెం: శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం కోలాటం ప్రదర్శన ఉంటుందని స్థానిక పరిపాలన అధికారి విశ్వనాథ రెడ్డి తెలిపారు. నగరానికి చెందిన లిటిల్ స్టెప్స్ స్కూలు విద్యార్థులు కోలాటం, కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తారని తెలిపారు.

వర్షం నీరు మళ్లింపు మొదటికే..!

- హైవేపై నిలిచిన నీరు తరలింపునకు గతంలో కాలువల తవ్వకం
- ముంపు భయంతో స్థానికుల అభ్యంతరం



వైఎస్సార్ సీపీ నాయకులతో చర్చిస్తున్న భీమిలి జెడ్సీ రాము

తగరపువలస: చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్, సంగివలస చెరువు వద్ద సర్వీస్ రోడ్లపై నిలిచిపోతున్న వర్షం నీరు తరలింపు సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. రోడ్లపై నిలిచిన నీటిని తాత్కాలికంగా మళ్లించేందుకు నెల రోజుల క్రితం జీవీఎంసీ అధికారులు హైవే డ్రైనేజీని ఆనుకుని జేసీబీతో కచ్చా కాలువను తవ్వించారు. ఈ కాలువను శ్రీబాసర లే అవుట్ ద్వారా బాలాజీనగర్ గెడ్డకు అనుసంధానం చేశారు. దీనికి వైఎస్సార్‌సీపీ ఒకటో వార్డు అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్ అభ్యంతరం వ్యక్తం చేశారు. బాలాజీనగర్ గెడ్డకు అవుట్ లెట్ లేనందున సంగివలస, ఆదర్శనగర్, ఊళ్లపేట, వలందపేట తదితర గ్రామాల నుంచి వర్షం నీరు బాలాజీనగర్ గెడ్డలోకి చేరితే గ్రామం ముంపునకు గురవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అలా కాకుండా వర్షం నీటిని సంగివలస చెరువు అవుట్‌లెట్లు లేదా చెరువు పడమర వైపు సత్యకల్యాణి లే – అవుట్ వైపు పంపించాలని జోనల్ కమిషనర్ బి.రాము దృష్టికి తీసుకొచ్చారు.

దీనికి సంగివలస వాసులు అంగీకరించడం లేదు. సర్వీస్ రోడ్లపై నిలిచిన నీటికి కచ్చా కాలువ ద్వారా పరిష్కారం లభించిందన్న ఆశ తీరకుండానే మళ్లీ సమస్య మొదటికి వచ్చింది. ఈ మేరకు జెడ్సీ బి.రాము సంగివలస చెరువు పరిసర ప్రాంతాలను శనివారం పరిశీలించి స్థానికుల అభిప్రాయాలు తీసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 2వ వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, సరగడ నాగిరెడ్డి, తెడ్లాపు అప్పలరాజు, బాలాజీనగర్ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రహదారి మధ్యలో స్తంభాలతో ఇక్కట్లు



రహదారికి అడ్డంగా ఉన్న స్తంభాలు

ఆనందపురం : ఆనందపురం–విశాఖ రోడ్డు నుంచి గంభీరం రిజర్వాయర్‌కి వెళ్లే రహదారికి మధ్యలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడంతో వాహనాల రాక పోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు కూడా అధ్వాన స్థితిలో ఉండడంతో, నడిచేందుకూడా వీల్లేని పరిస్థితి. గంభీరం రిజర్వాయర్‌కు సమీపంలో ఉన్న కొండపై సుమారు 40 ఇళ్లతో వైఎస్సార్ కాలనీ నిర్మిస్తున్నారు. లబ్ధిదారులంతా ఈ రోడ్డు మీదుగానే మెటీరియల్‌ను తరలించుకోవాలి. కానీ మొనతేలిన రాళ్లతో రోడ్డు ఉండడం, రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు ఏర్పాట చేయడంతో వాహనాలు రాక పోకలకు ఇబ్బందులేర్పడుతున్నాయి. ఈ స్తంభాలను తప్పించడానికి వాహనాల డ్రైవర్లు తిప్పలు పడాల్సి వస్తోంది. దీంతో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని వాపోతున్నారు. స్తంభాలకు వీధి లైట్లు లేక పోవడంతో, రాత్రివేళ వాహనదారులు స్తంభాలకు ఢీకొని ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మధ్యలో ఉన్న స్తంభాలను సరిచేసి, లైట్లు బిగించాల్సిందిగా కాలనీవాసులు కోరుతున్నారు.

గీతంలో పీహెచ్‌డీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొమ్మాది: గీతం విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరు ప్రాంగణాల్లో 2023 – 24 విద్యా సంవత్సరానికి పీహెచ్‌డీ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు తెలిపారు. గీతం విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్, సైన్స్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్, లా, సామాజిక శాస్త్ర విభాగాల్లో ప్రవేశాలకు రీసెర్చ్ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహిస్తున్నామన్నారు.

రోడ్డు మధ్యలో గోతుల పూడ్చివేతకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయడానికి తవ్విన గొయ్యి

ఆనందపురం : మండలంలోని ఆనందపురం – బోని మార్గంలోని రోడ్డు మధ్యలో ఉన్న గోతులను పూడ్చడానికి జీవీఎంసీ అధికారులు చర్యలు చేపట్టారు. రోడ్డు మధ్యలోఉన్న గోస్తనీ పైప్ లైను లీకై నీరు ఎగజిమ్మడం వల్ల రోడ్డుపై పెద్ద గోతులు ఏర్పడ్డాయి. అలాగే చందక వద్ద రోడ్డుపైకి వాడుక నీరు విడిచి పెట్టడం వల్ల తారు కొట్టుకుపోయి గతుకులమయమైంది. వీటి వల్ల జరుగుతున్న ప్రమాదాలపై సాక్షి పత్రికలో శుక్రవారం 'ఆనందపురం – బోని రోడ్డు మధ్యలో గోతులు' శీర్షికతో ప్రచురితమైన కథనానికి జీవీఎంసీ అధికారులు స్పందించారు. ఈ మేరకు శనివారం పైప్‌లైను లీక్ అవుతున్న ప్రాంతం వద్ద తవ్వకాలు జరిపి లీకైన పైప్‌ను వెలికి తీశారు. పైప్‌లైనుకు మరమ్మతులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నారు. గతంలో పలుమార్లు ఇక్కడ పనులు చేపట్టినా వెంటనే పాడైపోయి గోతులు పడిపోయాయని స్థానికులు తెలుపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు తాత్కాలిక చర్యలు కాకుండా శాశ్వతమైన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత



లక్ష్మికి నగదు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు వలందపేటకు చెందిన పెయింటర్ మొక్క శ్రీనివాసరెడ్డి ఈ నెల 20న రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో అతని భార్య లక్ష్మికి ఆదర్శనగర్ సచివాలయ సిబ్బంది శనివారం వైఎస్సార్ బీమా పంపిణీలో భాగంగా తక్షణ సాయం కింద రూ.10వేలు అందించారు. ప్రమాదంలో మృతి చెందిన కారణంగా అతని కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల బీమా సొమ్ము రానున్నట్టు తెలిపారు. మృతునికి 9 ఏళ్ల కుమారుడు హేమ నిఖిల్, 6 ఏళ్ల కుమార్తె దీక్షిత, తండ్రి సూర్యనారాయణ ఉన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చిల్ల సూర్యనారాయణరెడ్డి, కొసన శ్రీనివాసరెడ్డి, కోనాడ కనకారావు, శీరపు నరసింగరావు, కంబపు దుర్గారెడ్డి, డెక్కతి శివారెడ్డి, కొల్లి సత్యం, మొక్క రామిరెడ్డి, వెల్ఫేర్ సెక్రటరీ దేవి నాయుడు చిన్నారావు, వలంటీర్ గుర్రాల దాసు తదితరులు ఉన్నారు.

విద్యుత్ బిల్లుల చెల్లింపునకు బహుదూరం



చిట్టివలసలోని విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం

తగరపువలస : చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ వినియోగ బిల్లుల చెల్లింపునకు వినియోగదారులు 15 కిలోమీటర్ల పరిధిలో ఉన్న మధురవాడ వరకు రాకపోకలు సాగించాల్సి వస్తోంది. 2000 సంవత్సరానికి కంటే ముందు వినియోగదారుల నుంచి బిల్లుల వసూళ్లకు ఉదయం నుంచి సాయంత్రం వరకు చిట్టివలస సబ్‌స్టేషన్‌లో బిల్లు కలెక్టర్ ఉండేవాడు. ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా మీ సేవా కేంద్రాలు ప్రారంభించిన తర్వాత బిల్ కలెక్టర్ సేవలను నిలిపివేశారు. వినియోగదారులంతా తమ పరిధిలో మీ సేవా కేంద్రాల్లో బిల్లులు చెల్లించేవారు. మీ సేవా కేంద్రాల తొలగింపు తర్వాత బిల్లుల చెల్లింపు నిరక్షరాస్యులైన వినియోగదారులకు కష్టంగా మారింది. ఆండ్రాయిడ్ ఫోన్లు కలిగిన వారు బిల్ డెస్క్, పేటీఎం, ఫోన్ పే, డెబిట్ కార్డుల ద్వారా బిల్లులు చెల్లిస్తుండగా మిగిలిన వారు వారిపై ఆధార పడుతున్నారు. ఒక్కోసారి బిల్లు చెల్లింపు ఆలస్యమయినా, మరచిపోయినా విద్యుత్ సిబ్బంది కనెక్షన్లు తొలగిస్తున్నారు. వీటి పునరుద్ధరణకు వినియోగదారులు మధురవాడ ఈఆర్‌వో కేంద్రానికి పరుగులు తీయాల్సి వస్తోంది.

ఏటీపీ మిషన్ ఏర్పాటు చేయాలి

చిట్టివలసలో వినియోగదారుల బిల్లుల చెల్లింపునకు వీలుగా ఏనీ టైమ్ పేమెంట్(ఏటీపీ) మిషన్‌ను ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. నియోజకవర్గంలో మూడు మండలాలకు కేంద్ర బిందువైన చిట్టివలసలో సుమారు 19 వేలు కనెక్షన్లు ఉండగా, భీమిలి రూరల్‌లో 12 వేలు, భీమిలి పట్టణ పరిధిలో 19 వేలు, పద్మనాభంలో 18 వేలు, ఆనందపురంలో 24 వేల కనెక్షన్లు కలిపి మొత్తం 92 వేల మంది వినియోగదారులన్నారు. దీంతో వీరందరికీ చిట్టివలస అందుబాటులో ఉంటుంది. ఈ విషయాన్నే ఇక్కడి అధికారులు ఈఆర్‌వో దృష్టికి తీసుకుని వెళ్లారు. ఇక్కడ ఏటీపీ సెంటర్ ఏర్పాటు చేస్తే 365 రోజులు, 24 గంటలూ వినియోగదారులు క్యాష్, క్రెడిట్, డెబిట్ కార్డుల ద్వారా బిల్లు చెల్లింపులు చేసుకోవచ్చు.

రెండు రోజులే అందుబాటులో బిల్లు కలెక్టర్

రూరల్ పరిధిలో బిల్లు కలెక్టర్ రోజుకో పంచాయతీలో బిల్లులు వసూలు చేస్తున్నారు. ఆ సమయంలో వినియోగదారులు ఇళ్ల వద్ద లేకపోతే ఇక అంతే సంగతి. ఇలాంటి వారు ప్రతి నెలా చాలా ఇబ్బంది పడుతున్నారు. అటువంటి వినియోగదారుల కోసం ప్రతి నెలా 13, 16 తేదీల్లో చిట్టివలస సబ్‌స్టేషన్‌లో బిల్లు కలెక్టర్‌ను అందుబాటులో ఉంచుతున్నారు. ఆ సమయంలో ఎవరైనా బిల్లులు చెల్లించవచ్చని అధికారులు చెబుతున్నారు. అవసరమైతే బిల్లు కలెక్టర్‌ను 94934 23809 నంబరులో సంప్రదించవచ్చని చెబుతున్నారు.

వసతులు కల్పించండి



మధురవాడలోని పీర్‌లెస్ కాలనీ

తగరపువలస : జీవీఎంసీ మధురవాడ జోన్ జాతీయ రహదారిని ఆనుకుని పీఎం పాలెం పీర్‌లెస్ కాలనీ చుట్టూ కొత్తగా అనేక కాలనీలు వెలుస్తున్నాయి. ఇక్కడ సర్వే నెం.369లో పబ్లిక్‌కు అవసరమైన కనీస వసతులు కూడా లేవు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురి కావడమే కాకుండా సంఘ వ్యతిరేక కార్యక్రమాలు ఎక్కువగా జరుగుతున్నాయి. చుట్టుపక్కల గ్రామాల ప్రజలను దృష్టిలో పెట్టుకుని మినీ బజారు, పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, అంగన్‌వాడీ, పాఠశాలలు తదితర వసతుల్ని ఏర్పాటు చేయాలి.

వెలగని వీధిదీపాలు : పీర్‌లెస్ కాలనీలో 61/బి9, 10, 11, 12 తదితర విద్యుత్ స్తంభాలకు బిగించిన వీధిదీపాలు మూడు మాసాలుగా వెలగట్లేదు. మధురవాడ జోన్ సిబ్బంది కొత్త లైట్లను బిగించి, వీధి దీపాలను పునరుద్ధరించాలి.

– వి.అప్పారావు, పీర్‌లెస్ కాలనీ, పీఎం పాలెం

పార్కింగ్ సమస్య పరిష్కారానికి చర్యలు



మధురవాడ రైతు బజార్ పరిసరాలు పరిశీలిస్తున్న యాసిన్, తదితరులు

మధురవాడ: రైతుబజార్‌లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంతోపాటు బజార్ లోపలే వాహనాల పార్కింగ్‌కి ఏర్పాట్లు చేయాలని జిల్లా అగ్రికల్చర్ ట్రేడింగ్ మార్కెటింగ్ ఆఫీసర్ (డీఏటీఎమ్‌వో) ఎస్‌కే యాసిన్ సూచించారు. శనివారం ఆయన కొమ్మాది జంక్షన్ సమీపంలోని మధురవాడ రైతు బజార్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పరిసరాలు, ట్రాఫిక్ సమస్య, నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తున్న దుకాణాలపై ఆరా తీశారు. మార్కెట్ లోపల వాహనాలు పార్కింగ్ చేసుకోవడానికి అనువైన పరిస్థితులు కల్పించాలన్నారు. రాళ్లు తేలి ఉన్న మైదానాన్ని చదును చేయించాలని ఆదేశించారు. అనంతరం కొత్తగా ఏర్పాటు చేసిన స్టాళ్లు పరిశీలించారు. ఆయనతోపాటు ఎస్టేట్ ఆఫీసర్ జగదీష్ ఉన్నారు.

హైవే డివైడర్‌పై గ్రిల్స్ ఏర్పాటుకు చర్యలు



డివైడర్‌పై గ్రిల్స్ ఏర్పాటు పనులు పరిశీలిస్తున్న సీఐ సాయి

మధురవాడ: జాతీయ రహదారిలో సెంటర్ డివైడర్‌పై కొమ్మాది జంక్షన్ నుంచి పీఎం పాలెం ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వరకు గ్రిల్స్ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్టు నార్త్ జోన్ ట్రాఫిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ సాయి చెప్పారు. శనివారం ఆయన పీఎం పాలెం, మధురవాడ, కొమ్మాది కూడలిలో పనులు పరిశీలించారు. గ్రిల్స్ లేకపోవడంతో పాదచారులు అకస్మాత్తుగా రోడ్డు క్రాస్ చేయడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదాల నివారణకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు.

30 నుంచి వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు



పాండ్రంగిలోని వేణుగోపాలస్వామి ఆలయం

పద్మనాభం: మండలంలోని పాండ్రంగిలో కొలువైన శ్రీ వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు ఈ నెల 30 నుంచి జూన్ 4 వరకు జరుగుతాయి. 30న కల్యాణోత్సవాలకు అంకురార్పణ చేయనున్నారు. ఇందులో భాగంగా విశ్వక్సేన పూజ, ధ్వజారోహణం నిర్వహిస్తారు. 31న నిత్య హోమం అనంతరం రుక్మిణి, వేణుగోపాల స్వామి విగ్రహాలకు కల్యాణం జరుపుతారు. జూన్ ఒకటి నుంచి 3 వరకు నిత్య హోమాలు చేస్తారు. 4న రాత్రి పుష్పాంజలితో కల్యాణోత్సవాలు ముగుస్తాయి.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు



మాట్లాడుతున్న జేసీ విశ్వనాథన్, చిత్రంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ప్రసాదరాజు

మహారాణిపేట: రైతు భరోసా కేంద్రాలు ద్వారా పచ్చిరొట్ట విత్తనాలు సబ్సిడీపై రైతులకు సరఫరా చెయ్యాలని జేసీ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ డీవీఏ ప్రసాద్ రాజు అధ్యక్షతన జేసీ విశ్వనాథన్, వ్యవసాయ, ఉద్యానవన, మత్స్యశాఖ, సూక్ష్మ సేద్యం, పశు సంవర్ధక శాఖ అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఖరీఫ్ 2023 సీజన్లో నాణ్యమైన విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా తగిన స్థాయిలో రైతులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.అప్పలస్వామి, జిల్లా ఉద్యానవన శాఖ జేడీ కె.మన్మథరావు, పశుసంవర్ధక శాఖ జేడీ రామకృష్ణ, పీడీ ఏపీఎంఐపీ, డీఎం మార్క్ ఫెడ్, ఏపీ సీడ్స్ అభివృద్ధి అధికారి సాయినాథ్, మార్కెటింగ్ ఏడీ యాసిన్ పాల్గొన్నారు.

వీధి దీపాల సమస్యకు చెక్



వీధి దీపాలు అమర్చుతున్న సిబ్బంది

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డులో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు వీధి దీపాల సమస్యకు అధికారులు పరిష్కారం చూపించారని కార్పొరేటర్ లొడగల అప్పారావు తెలిపారు. ఈ సమస్యకు చెక్ పెట్టే విధంగా 8వ వార్డును పైలెట్ ప్రాజెక్టుగా గుర్తించి 20 ఎల్ఈడీ లైట్లు, ఫ్యాన్‌లు అందించారని తెలిపారు. దీంతో వెలగని చోట కొత్త దీపాలు ఏర్పాటు చేయిస్తున్నామని తెలిపారు.

ఘంటసాల జీవితంపై నాటక ప్రదర్శన నేడు

మద్దిలపాలెం: ఘంటసాల జీవిత చరిత్ర ఇతివృత్తంతో మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం 5 గంటల నుంచి నాటకాన్ని ప్రదర్శించనున్నామని రంగసాయి వ్యవస్థాపకులు బాదంగీర్ సాయి తెలిపారు. దేశంలో తొలిసారిగా రంగసాయి నాటక సంఘం ఆధ్వర్యంలో స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన శ్రీసాయి సంతోషి నాట్యమండలి సురభి వారిచే భాస్కరుని సత్య జగదీష్ రచన, దర్శకత్వంలో నాటకం ప్రదర్శించనున్నట్లు చెప్పారు. సాయంత్రం 5 గంటలకు తొలి ప్రదర్శన, రాత్రి 7.30 గంటలకు రెండో ప్రదర్శన ఉంటుందన్నారు. ఇదే వేదికపై చిన్నారులతో లవకుశ పాటల ప్రదర్శన ఉంటుందని తెలియజేశారు. టిక్కెట్లు కొనుగోలు చేసుకున్నవారు, వారికి నిర్దేశించిన సమయం ప్రకారం ప్రదర్శనలకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 94404 58458 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

విద్యా కానుక కిట్ల నాణ్యత పరిశీలన

విశాఖ విద్య: జగనన్న విద్యా కానుక కిట్ల నాణ్యతపై శనివారం ప్రత్యేక బృందాలు తనిఖీ చేశాయి. 2023–24 విద్యా సంవత్సరం బడి తెరిచిన రోజునే విద్యార్థులందరికీ కిట్లు అందించేలా ఇప్పటికే పూర్తి స్థాయిలో వస్తువులన్నీ జిల్లాకు సరఫరా అయ్యాయి. వాటిని ఎంపిక చేసిన స్టాక్ పాయింట్లలో నిల్వ చేశారు. విద్యార్థులకు అందించే విద్యా కానుక కిట్లులో నాణ్యతకు పెద్దపీట వేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో స్టాక్ పాయింట్లలో నిల్వ చేసిన వస్తువుల నాణ్యత తనిఖీల కోసమని డీఈవో లక్ష్మణరావు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఎంఈవోల నేతృత్వంలో ఆయా మండలాల్లోని ముగ్గురు సీనియర్ హెచ్‌ఎంలను సభ్యులుగా ప్రత్యేక టీమ్‌లను నియమించారు. వీరంతా స్టాక్ పాయింట్లను సందర్శించి, కిట్లను సమగ్ర పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. దీంతో శనివారం జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బృందాలు స్టాక్ పాయింట్లను తనిఖీ చేశాయి. చైల్డ్ ఇన్ఫో గణాంకాల మేరకు స్టాక్ పాయింట్లకు వచ్చిన వస్తువులు, నిల్వ ఉన్న వస్తువులు, వాటి నాణ్యత వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆ నివేదిక డీఈవోకు అందజేస్తామని చినగదిలి మండల తనిఖీ బృందంలోని సభ్యులు, సీనియర్ హెచ్‌ఎం ఇమండి పైడిరాజు తెలిపారు.

ఓవర్ స్పీడ్ వాహనాలపై కేసులు



యంత్రం సాయంతో వాహనాల వేగాన్ని అంచనా వేస్తున్న పోలీసులు

ఆనందపురం: మండలంలోని పెద్దిపాలెం జాతీయ రహదారిపై శనివారం ట్రాఫిక్ సిబ్బంది ఇంటర్ సెప్టార్ వాహనం స్పీడ్ గన్‌తో వాహనాల వేగాన్ని అంచనా వేశారు. హైవేపై అతి వేగంగా వాహనాలు నడుపుతున్న 159 మంది యజమానులకు రూ.70,200లు జరిమానా విధించారు. అందులో కార్లు 152, మోటార్ సైకిళ్లు 4, ఆర్టీసీ బస్ ఒకటి, ప్రైవేట్ బస్ ఒకటి, లారీ ఒకటి ఉన్నాయి. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ రఘురామ్ మాట్లాడుతూ వాహనాలను వేగంగా నడపడం వల్ల ప్రమాదాలు సంభవిస్తాయని, వాహన చోదకులు నిబంధనలు పాటించాలని కోరారు.

మూడు కిలోల గంజాయి స్వాధీనం

పీఎం పాలెం: ఆర్టీసీ బస్సులో మూడు కిలోల గంజాయి కనిపించడంతో డ్రైవర్, కండక్టర్ పీఎం పాలెం పోలీసులకు అందించారు. ఇందుకు సంబంధించి సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... ఒడిశాలోని నవరంగ్‌పూర్ నుంచి విశాఖకు వస్తున్న ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన శ్రీకాకుళం జిల్లా సంకిలి ప్రాంతానికి చెందిన ప్రయాణికుడు తన పర్స్ పోగొట్టుకున్నాడు. అదే విషయాన్ని కండక్టర్‌కు తెలియజేశాడు. వెంటనే మధురవాడ బస్టాపు వద్దకు బస్సు చేరుకోగానే నిలిపి వెతగ్గా పర్సు లభించలేదు. అయితే అదే సమయంలో మూడు కిలోల గంజాయి పాకెట్లు లభ్యమయ్యాయి. వెంటనే డ్రైవర్ జీకే రావు, కండక్టరు నేరుగా పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి గంజాయి అప్పగించారు. బస్సులో పర్సు కోసం పరిశీలిస్తున్న సమయంలో గంజాయి స్మగ్లర్లు జారుకుని ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

వారాంతాల్లో కొండను తవ్వేస్తున్నారు!

- నేరెళ్లవలస కాలనీలో ఆగని అక్రమ తవ్వకాలు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ 3వ వార్డు నేరెళ్లవలస కాలనీలో ప్రతి శనివారం, ఆదివారం సాయంత్రం వేళల్లో ప్రారంభించి ఉదయం వరకు యంత్రాలతో కొండను యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. ఈ సమయంలో అధికారులు అందుబాటులో ఉండరు కాబట్టి అక్రమార్కులు తవ్వుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ సిబ్బంది మాత్రం గతంలో అక్కడ పాకలు ఉండేవని, వాటికి పన్నులు చెల్లించారని, ఆ హక్కుతో తవ్వకాలు చేస్తున్నట్టు వెనుకేసుకొస్తున్నారు. వాస్తవానికి తవ్వకందారులకు హక్కులే ఉంటే మిగిలిన రోజుల్లో కొండ జోలికి వెళ్లకుండా కేవలం శని, ఆదివారాల్లోనే ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరిపి లారీలతో గ్రావెల్‌ను ఎందుకు తరలిస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇష్టారాజ్యంగా తవ్వకాల కారణంగా ఇప్పటికే అక్కడి ఇళ్లకు ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భీమిలి తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలను ఆనుకుని కేవలం 200 మీటర్ల దూరంలో తవ్వకాలు జరుపుతున్నారు. ఇటీవల ఈ ప్రాంతంలో ప్రభుత్వ స్థలాలు చదునుచేసి జీవీఎంసీ విభాగ రెవెన్యూ అధికారులతో పన్నులు వేయించి రూ.లక్షలకు విక్రయాలు జరుపుతున్నారు. ఇలాంటి అక్రమ తవ్వకాలను జీవీఎంసీ, రెవెన్యూ అధికారులు ప్రోత్సహించకుండా చర్యలు చేపట్టాలని నేరెళ్లవలస కాలనీవాసులు కోరుతున్నారు.